# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

గురువారం | 13 నవంబర్ 2025 | పేజీలు 8


# మేడిగడ్డ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాం


### సాంకేతిక సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించాం

### నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను శాస్త్రీయ విధానంలో పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సాంకేతిక సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించగా... కొన్ని సంస్థలు ముందుకొచ్చాయని

-2 లో



- బ్యారేజీల్లో అవకతవకలకు మాజీ సీఎం నిర్ణయాలే కారణమని చెప్పింది
- విచారణకు భారత రాష్ట్ర సమితి అధినేత స్వచ్ఛందంగా హాజరయ్యారు
- కేసీఆర్ పిటిషన్‌ను కొట్టివేయండి
- హైకోర్టులో ప్రభుత్వం కౌంటర్

## కాళేశ్వరంలో కేసీఆర్ అక్రమాలను

# కమిషన్ నిర్ధారించింది

**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో విధాన, పరిపాలన, ఆర్థికపరమైన అవకతవకలపై జస్టిస్ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసి విచారణ జరిపించినట్లు హైకోర్టుకు ప్రభుత్వం బుధవారం నివేదించింది. మాజీ సీఎం కేసీఆర్ అక్రమాలను కమిషన్ నిర్ధారించిందని పేర్కొంది. ఆయన తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలతో ప్రభుత్వ ఖజానాకు రూ.7,500 కోట్ల నష్టం వాటిల్లినట్లు వెల్లడించిందని తెలిపింది. సమష్టి నిర్ణయమంటూ కేసీఆర్ తప్పించుకోజాలరని, మంత్రివర్గం ఆమోదం పొందనందున అది సమష్టి నిర్ణయం కాబోదని పేర్కొంది. రాజ్యాంగం ప్రకారమే కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్‌కు అవకాశం కల్పించాలని కేసీఆర్ అడగలేదని, అందువల్ల ఇప్పుడు అభ్యంతరం తెలపడం చెల్లదంది. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను సవాలు చేస్తూ కేసీఆర్ వేసిన పిటిషన్‌లో హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా వేసిన

-2 లో



## అటవీ అధికారులు, పోడు రైతుల బాహాబాహీ

### పలువురికి గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో పోడు రైతులకు, అటవీ శాఖ అధికారులకు మధ్య తలెత్తిన తగాదా ఒకరిపై ఒకరు భౌతిక దాడులకు దిగేవరకు వెళ్లింది. దండేపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన సుమారు 50 మంది పోడు రైతులు తమ భూ సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు బుధవారం లక్షెట్టిపేట రేంజి కార్యాలయానికి వచ్చారు. వారిలో 27 మందిపై గతంలో అరెస్టు వారెంట్ జారీ అయి ఉండటంతో అటవీ అధికారులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించేందుకు యత్నించారు. వారంతా తిరగబడి అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లారు. వారిని లక్షెట్టిపేటలోని ఉత్కూర్ చౌరస్తాలో అదుపులోకి తీసుకునేందుకు అధికారులు యత్నించారు. స్థానికులు అధికారుల వాహనాలకు అడ్డుపడటంతో జాతీయ రహదారిపై అటవీ అధికారులు, పోడు రైతులకు మధ్య తోపులాట జరిగి

-2 లో

## సచివాలయంలో భారీగా బదిలీలు..

### 134 మంది ఆఫీసర్లను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉత్తర్వులు జారీ




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ సెక్రటేరియట్ లో భారీగా బదిలీలు చేపట్టింది ప్రభుత్వం. చాలా కాలంగా ఒకే డిపార్టుమెంట్ లో పనిచేస్తున్న అధికారులకు స్థానచలనం కలిగించింది. మొత్తం 134 మంది అధికారులను బదిలీ చేస్తూ 2025 నవంబర్ 12వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం. చాలా కాలంగా ఒకే శాఖలో పనిచేస్తున్న ఆఫీసర్లను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం .సచివాలయంలో ఒకే శాఖలో పనిచేస్తున్న 134 మంది అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ల ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం. ఏ ఏ శాఖలను ఎవరెవరిని బదిలీ చేశారనే వివరాలు ఈ కింది ఇమేజ్ లో చూడవచ్చు. సెక్రటేరియెట్‌లో బదిలీలు 2025 ఫిబ్రవరిలో నెలలో జరిగాయి. ఆ నెలలో172 మంది సెక్షన్ ఆఫీసర్ల (ఎస్‌వో)ను ప్రభుత్వం బదిలీ చేసింది ప్రభుత్వం. ఆ తర్వాత ఇంత భారీ మొత్తంలో బదిలీలు చేయడం ఇదే.

## అసలు బాంబు పేలుళ్లకు,

# బీజేపీకి ఏం సంబంధం?

- ఢిల్లీ పేలుళ్లపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీజేపీ ఎంపీ రఘునందన్ ఆగ్రహం
- బీజేపీకి సంబంధం ఉందంటూ పోస్టులు పెట్టడం దేశద్రోహమేనని వ్యాఖ్య
- చేతిలో ఫోన్ ఉందని ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల ఘటనను బీజేపీకి ఆపాదిస్తూ కొందరు సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేయడం దేశద్రోహం కిందికే వస్తుందని ఆయన హెచ్చరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డిలో నిర్వహించిన 'సర్దార్–ఏక్తా పాదయాత్ర'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు."చేతిలో ఫోన్ ఉంది కదా అని ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు. ఎన్నికలు

-2 లో

# కాళేశ్వరంలో కేసీఆర్ అక్రమాలను కమిషన్ నిర్ధారించింది

- మొదటి పేజీ తరువాయి

కౌంటరులోని అంశాలు...స్వచ్ఛందంగా హాజరయ్యారు...

కమిషన్ ముందు విచారణకు కేసీఆర్ అభ్యంతరం తెలపకుండా స్వచ్ఛందంగా హాజరయ్యారు. కమిషన్ సమర్పించింది నిజనిర్ధారణ నివేదిక మాత్రమేనని... దాని ఆధారంగా చర్యలు తీసుకోవడానికి వీల్లేదని రామకృష్ణ దాల్మియా వర్సెస్ జస్టిస్ ఎస్.ఆర్.తెందుల్కర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేసీఆర్ ప్రస్తావించారు. ప్రస్తుత కేసులో అందరినీ విచారించిన తర్వాత నిబంధనల ప్రకారం కేసీఆర్‌ను కమిషన్ విచారణకు పిలిపించింది. ఆయన విజ్ఞప్తి మేరకు ఇన్–కెమెరా ప్రొసీడింగ్స్ చేపట్టింది. అయినా తనకు వాదన వినిపించే అవకాశం ఇవ్వలేదనడం సరికాదు. ప్రజాప్రయోజనాల కోసమే ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ కుంగిపోవడం, ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణ, నిర్వహణలో లోపాలున్నాయని, పునర్నిర్మించకపోతే నిరుపయోగంగా మారుతుందని జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ ప్రాథమిక నివేదికలో పేర్కొంది. కొంత మంది ప్రయోజనాల నిమిత్తం ప్రజాధనం దుర్వినియోగం చేశారు. స్థలం ఎంపిక నుంచి డిజైన్ ఖరారు, కాంట్రాక్టుల అప్పగింత, అమలు, నిర్వహణ అంతా కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే జరిగింది. ప్రభుత్వ రికార్డుల ఆధారంగా జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ చేపట్టింది. బ్యారేజీ నిర్మాణంలో పాత్ర ఉన్న సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా నివేదిక సమర్పించింది. బ్యారేజీల ప్లానింగ్, డిజైన్, నిర్మాణం, కాంట్రాక్టు అప్పగింత, అమలు, నాణ్యత, ఆర్థిక నిర్వహణల్లో అక్రమాలు జరిగినట్లు కమిషన్ నిర్ధారించింది.

**అన్నింటికీ కారణం కేసీఆరే!**

బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలకు కేసీఆర్ సహా కొంతమంది రాజకీయ నాయకులు, ఐఏఎస్‌లు, ఇంజినీరింగ్ అధికారులు బాధ్యులని కమిషన్ తేల్చిచెప్పింది. స్థలం, డిజైన్ ఎంపిక వంటి కీలక దశలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నందువల్ల... ఆయన పాత్రపై విచారణ తప్పనిసరి. సీడబ్ల్యూసీకి డీపీఆర్‌ను సమర్పించడానికి 11 నెలల ముందే పరిపాలనాపరమైన అనుమతులు మంజూరయ్యాయి. నిర్మాణంలో కాంట్రాక్టర్ల ఎంపిక, అంచనా సవరణలు, షరతుల్లో సడలింపులు దురుద్దేశపూరితమైనవే. అంచనా విలువ రూ.1,942.48 కోట్లు పెంచడం వల్ల కాంట్రాక్టర్లకు రూ.612.51 కోట్ల అనుచిత లబ్ధి కలిగింది. దీన్ని వసూలు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది.

**విధివిధానాల ప్రకారమే విచారణ**

కమిషన్ విధివిధానాలను పిటిషనర్ సవాలు చేయలేదు. కమిషన్ నివేదిక... పిటిషనర్ సహా అందరికీ అందుబాటులో ఉంది. దాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టకముందు బయటకు వెల్లడించలేదు. మంత్రివర్గం అవగాహన నిమిత్తం నిర్వహించిన

పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లోని అంశాలు పత్రికల్లో రాగా... వాటి ఆధారంగా ఆరోపణలు చేస్తున్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నిష్పాక్షికంగా, సుదీర్ఘంగా విచారణ జరిపి ఆధారాలతో నివేదిక సమర్పిస్తే రాజకీయంగా తన ప్రతిష్ఠను దెబ్బతీయడానికేనని కేసీఆర్ చెప్పడం సరికాదు. కమిషన్ విచారణ సందర్భంగా సెక్షన్ 8(బీ), 8(సీ)ల గురించి అడగకుండా.... ఇప్పుడు ప్రశ్నిస్తూ పిటిషన్ వేయడం చెల్లదు. అందువల్ల ఆ పిటిషన్‌ను కొట్టివేసి, మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలి.

# మేడిగడ్డ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాం

- మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. పునరుద్ధరణ పనుల కోసం చేపట్టే సాంకేతిక పరీక్షలకు అయ్యే ఖర్చును బ్యారేజీలను నిర్మించిన కాంట్రాక్టర్లే భరించాలని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో మేడిగడ్డతోపాటు ప్రాణహిత–చేవెళ్ల, సమ్మక్క–సారక్క ప్రాజెక్టు, సీతమ్మసాగర్, సీతారామసాగర్, మోడికుంట వాగు, చనాఖా–కోర్టా, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులు, కృష్ణా నదీజలాల వివాదాల ట్రైబ్యునల్, దేవాదుల ప్యాకేజీ–6 సవరణ అంచనాలు, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ హెలిబోర్న్ సర్వే తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ అనుమతులు వేగంగా సాధించడంపై దృష్టి పెట్టాలని, ప్రాణహిత–చేవెళ్లకు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలని అధికారులకు సూచించారు. “గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై భారీగా ప్రజాధనం వెచ్చించింది. బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకురావడమే ప్రభుత్వంపై ఉన్న ముఖ్యమైన బాధ్యత. మేడిగడ్డ బ్యారేజీ కుప్పకూలడానికి, అన్నారం, సుందిళ్లల్లో లీకేజీలకు అడ్డగోలు నిర్ణయాలు, వ్యవస్థాపరమైన వైఫల్యాలు కారణమని విజిలెన్స్ కమిషన్, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, జ్యుడీషియల్ కమిషన్ నివేదికలు స్పష్టం చేశాయి. నీటిపారుదలశాఖకు చెందిన సీడీవోను విచారణ సంస్థలు తప్పుబట్టాయి. రాజకీయ, ఇంజినీరింగ్ స్థాయిల్లో వైఫల్యాలున్నాయి. ఈ నేపథ్యంలో స్వతంత్ర, అత్యున్నత సాంకేతిక సంస్థలను కన్సల్టెంట్లుగా నియమించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**వరదనీరు తగ్గిన తర్వాతే పరీక్షలు..**

గోదావరిలో వరదనీరు తగ్గిన 15–20 రోజుల తర్వాత పుణెలోని కేంద్ర జల, విద్యుత్తు పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) ద్వారా భూభౌతిక, హైడ్రాలిక్ పరీక్షలు నిర్వహిస్తాం. ప్రతిపాదనలిచ్చిన సంస్థల్లో ఐదింటిని షార్ట్‌లిస్ట్ చేస్తాం. వాటిలో మూడింటిని తుది దశకు ఎంపిక చేస్తాం. ఎంపికైన సంస్థ... సీడబ్ల్యూపీఆర్ఎస్ డేటాను ఉపయోగించుకుని డిజైన్లు, అంచనాలు రూపొందించాల్సి ఉంటుంది. డిజైన్లను సీడబ్ల్యూసీ ఆమోదించిన తర్వాతే పనులు ప్రారంభిస్తాం” అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

## అటవీ అధికారులు, పోడు రైతుల బాహాబాహీ

- మొదటి పేజీ తరువాయి


పరిస్థితి చేయిదాటి పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఆరుగురు పోడు రైతులతో పాటు ఆరుగురు అటవీ శాఖ సిబ్బంది గాయపడ్డారు. వారిని లక్షెట్టిపేట, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. నిందితులను అరెస్టు చేయడానికి యత్నించగా వారు తమ సిబ్బందిని గాయపరిచి పారిపోయినట్లు జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్ వెల్లడించారు.

## అసలు బాంబు పేలుళ్లకు, బీజేపీకి ఏం సంబంధం?

- మొదటి పేజీ తరువాయి

వస్తున్నాయంటే పేలుళ్లు జరుగుతాయని, దీని వెనుక బీజేపీ ఉందని నీచంగా మాట్లాడుతున్నారు. అసలు బాంబు పేలుళ్లకు, బీజేపీకి ఏం సంబంధం?” అని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్న వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, ప్రజలు ఎవరూ ఇలాంటి వారిని సమర్థించవద్దని ఆయన కోరారు.ఢిల్లీలో బాంబులు పేల్చాలని ఒక వర్గం వారు కుట్ర పన్నారని, ఇప్పుడు ఆ నెపాన్ని బీజేపీపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని రఘునందన్ రావు ఆరోపించారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. ఉగ్రవాద చర్యలను ఖండించాల్సింది పోయి, ఒక రాజకీయ పార్టీపై బురద చల్లడం దారుణమని ఆయన అసహనం వ్యక్తం చేశారు.

## పులి సంచారం కలకలం




**అదిలాబాద్: పెన్ పవర్:**సిరికొండ మండలం సాత్ మ్నెరి గ్రామంలో పులి ఆవుపై దాడి చేసి చంపివేసింది. సమాచారం అందుకున్న ఆటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని పులి ఆనవాళ్లను పరిశీలించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలుఅప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.


## దేశ సమగ్రతను దెబ్బ తీసేలా మాట్లాడవద్దు

**సంగారెడ్డి:పెన్ పవర్:**ఢిల్లీ పేలుళ్ల ఘటనపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడారు. బీహార్ ఎన్నికలకు కొన్ని గంటల ముందు ఢిల్లీలో పేలుడు జరిగింది. ఈ పేలుళ్లకు బీజేపీ పార్టీకి సంబంధం ఉందని కొంతమంది ప్రచారం చేస్తున్నారు. దేశ సమగ్రతను దెబ్బ తీసేలా మాట్లాడటం సరికాదు. ఓ వర్గానికి సంబంధించిన డాక్టర్లు కుట్ర పన్నితే వాళ్ళని అరెస్ట్ చేసినప్పుడు అలజడి సృష్టించాలని అనుకున్నారని అన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో వినూత్న ఆలోచనతో కోతులకు చెక్

- పంచాయితీ వర్కర్ ప్రతిరోజు ఎలుగుబంటి వేషధారణలో గ్రామంలో పర్యటన
- ఎలుగుబంటి వేషాధారణకు బయపడి పారిపోయిన కోతులు






**వేములవాడ: పెన్ పవర్:**ఇందు గలదు, అందు లేదని సందేహం వలదు అన్న చందంగా కోతులు బెడద ప్రతి గ్రామంలో ఉంది. పలుచోట్ల దాడులు చేస్తు ప్రజలను గాయపరుస్తున్నాయి. అదేవిధంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం వట్టెంల గ్రామంలో కోతుల బెడద ఎక్కువయింది. ఇళ్లలోకి చొరబడడం, ప్రజలపై దాడులు చేయడం, పిల్లలు బడికి వెళ్లాలంటే భయపడే పరిస్థితి వచ్చింది. పిల్లలు స్కూల్లో మధ్యాహ్నం భోజనం సమయంలో కోతులు ఎగబడి గాయపరిచిన పరిస్థితులు ఉన్నాయి. కోతుల బెడదతో భయాందోళన చెందిన గ్రామస్తులకు ఉపశమనం కల్పించేలా గ్రామ కార్యదర్శి కృష్ణమోహన్ వినూత్న ఆలోచన చేశాడు. ఎలుగుబంటి వేషధారణతో కోతులకు చెక్ పెట్టాడు. స్కూల్లో మధ్యాహ్న భోజన సమయంలో ఎలుగుబంటి వేషాధారణతో తిష్ట వేయడంతో కోతులు అటువైపు రావడానికి భయపడ్డాయి. గ్రామ పంచాయతీ వర్కర్ కు ఎలుగుబంటి వేషాధారణ డ్రెస్ వేసుకుని ఊరంతా తరగడంతో వానరాలు గ్రామం వీడి వనం బాట పట్టాయి. ఎలుగుబంటి వేషాధారణకు భయపడి కోతులు ఊరికి దూరంగా పారిపోయాయి. స్కూల్ వైపు, గ్రామం వైపు కోతులు రావడం మానేశాయి. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు పంచాయతీ కార్యదర్శి ఆలోచనను అభినందిస్తున్నారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా కావడంతో వాటికి చిక్ పెట్టేందుకు చింపాంజి డ్రెస్ కొనుక్కొచ్చి గ్రామపంచాయతీ వర్కర్ కు వేసి గ్రామంలో తిప్పుతున్నామని కార్యదర్శి తెలిపారు.

# బకాయిలతో సహ ఇన్పుట్ సబ్సిడీ వెంటనే చెల్లించాలి

## పంట నష్టం, మార్కెటింగ్ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

**హైదరాబాద్ పెన్ పవర్:**సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో పంట నష్టం, మార్కెటింగ్ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.వక్తలు మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన పంట నష్టానికి ఇన్పుట్ నబ్సిడిని, గత బకాయిలతో సహా వెంటనే రైతుల అకౌంటులలో వేయాలి. . ఈ ఖరీప్ సీజన్లో జరిగిన పంట నష్టానికి తుది జాబితాలు తయారు చేయడంలో జరిగిన లోపాలను సరి చేసి, అర్హులైన రైతులందరినీ దానిలో చేర్చి వాళ్ళకి కూడా ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలి. దీని కోసం పారదర్శకమైన ప్రక్రియను ఏర్పాటు చేయాలని అన్నారు.పటిష్టమైన, రైతు అనుకూలమైన పంటల బీమా పథకాన్ని వెంటనే అమలులో తేవాలి (ఈ రబీ సీజన్ నుండే). ప్రభుత్వమే కౌలు రైతులతో సహా రైతులందరినీ నమోదు చేసి వారి ప్రీమియం కట్టే విధంగా అమలు చేయాలి. పంట నష్టాన్ని అంచనా వేసి ఎన్యూమరేషన్ చేసే పద్ధతి ని పారదర్శకంగా అమలు చేయాలి. నష్టపోయిన రైతుల జాబితాలను గ్రామ స్థాయిలో ప్రకటించి, వారికి ఫిర్యాదు చేసి సరి చేసుకునే అవకాశం కల్పించాలి. కేంద్రం వెంటనే విపత్తు సహాయ నిది నుండి నిధులను పూర్తి స్థాయిలో మంజూరు చేయాలి. విపత్తు సహాయాన్ని తరి పంటలకి, వర్షాధార పంటలకి కూడా ఎకరానికి 15,000 చేయాలని అన్నారు.

# సుభాన్ బేకరీ నూతన బ్రాంచ్ ప్రారంభం




**హైదరాబాద్ పెన్ పవర్:**

ఉస్మానియా బిస్కెట్లు, దమ్-కే-రోట్, ఫ్రూట్ కేక్లతో హైదరాబాదీ రుచిని తరతరాలుగా అందిస్తున్న సుభాన్ బేకరీ సింధీ కాలనీలో కూడా సేవలందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ రుచుల్లో అగ్రగామిగా పేరుపొందిన సుభాన్ బేకరీ ఇప్పుడు తన కొత్త కేఫ్ను సికింద్రాబాద్లో ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఉస్మానియా బిస్కెట్లు, దమ్-కే-రోట్, ఫ్రూట్ కేక్లతో హైదరాబాదీ రుచినితరతరాలుగా నిలబెట్టిన ఈ బేకరీ ఇప్పుడు ఆధునిక కేఫ్ రూపంలో కొత్త అనుభూతిని అందిస్తోందని ఈ సందర్భంగా రసూల్ బీ సాహిబా తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ.. ఇది కేవలం బేకరీకాదు, తమ సంప్రదాయం, కస్టమర్లతో ఉన్న బంధానికి ప్రతీకని అన్నారు. నాణ్యత, విశ్వసనీయత, హైదరాబాదీ టచ్ సుభాన్ బేకరీ ఈ కొత్త బ్రాంచ్ ద్వారా సికింద్రాబాద్ ఫుడ్ లవర్స్ హృదయాలను గెలుచుకోనుందనిఆయన పేర్కొన్నారు.

## కలెక్టర్ కార్యాలయం ముందు పత్తి రైతుల అందోళన

**నల్గోండ: పెన్ పవర్:**నల్లగొండ కలెక్టర్ కార్యాలయం ముందు పత్తి రైతులు ఆందోళన చేపట్టారు. దెబ్బతిన్న పత్తి పంటను ప్రదర్శిస్తూ.. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సిసిఐ అనాలోచిత నిర్ణయాలు రైతుల గోడు పట్టించుకునే నాథుడు లేడన్నారు. రేవంత్ ప్రభుత్వం రాష్ట్ర పత్తి రైతాంగాన్ని కాపాడాలని.. ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి.. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కి మెమోరాండం అందించారు.

## ఆసుపత్రిలో దొంగ

**హైదరాబాద్ పెన్ పవర్:**అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ ఆసుపత్రిలో అర్ధరాత్రి దొంగతనం జరిగింది. పేషెంట్లు నిద్రపోతున్న సమయంలో, ఓ ఆగంతకుడు వారి సెల్ఫోన్లను దొంగిలించాడు. ఈ ఘటన సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## కిడ్నీ రాకెట్ కేసు..

### పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు

**హైదరాబాద్ పెన్ పవర్:**మదనపల్లిలో కిడ్నీ రాకెట్ గుట్టురట్టయింది. మదనపల్లి పట్టణంలోని గ్లోబల్ ఆస్పత్రిలో కిడ్నీల మార్పిడి గోల్మాల్ అయింది. కిడ్నీ ఇచ్చిన మహిళ యమున మృతిచెందడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి భర్త సూరిబాబు ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గ్లోబల్ ఆస్పత్రిపై తనిఖీలు చేశారు మదనపల్లి పోలీసులు. ఈ కేసులో నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.అన్నమయ్య జిల్లాకు చెందిన డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు కోడలు డాక్టర్ శాశ్వతి గ్లోబల్ ఆస్పత్రిని నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మదనపల్లి డయాలసిస్ కేంద్రం మేనేజర్ బాలు, పుంగనూరు డయాలసిస్ కేంద్రం మేనేజర్ వెంకటేశ్ నాయక్లు కూడా కిడ్నీ రాకెట్ వెనుక ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ముఠా ద్వారా కిడ్నీల మార్పిడికి డాక్టర్ శాశ్వతి ప్లాన్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

## నల్ల పోచమ్మ ఆలయంలో చోరీ

**హైదరాబాద్ పెన్ పవర్::**ఖానాపూర్ పట్టణంలోని రెంకోనివాగు ఒడ్డున గాంధీనగర్ శివారులోని నల్లపోచమ్మ ఆలయంలో అర్ధరాత్రి తలుపుల తాళాలు పగులగొట్టి ఓ దొంగ చోరీకి యత్నించాడు. ఆలయ ప్రధాన ద్వారంతో పాటు, గర్భగుడి తాళాలు సైతం పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. రాత్రి 1.13 గంటలకు చోరీకి యత్నించినట్టు సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. అమ్మా నన్ను క్షమించు అన్న చందంగా గర్భగుడిలో కలశంపై ఉన్న కొబ్బరికాయ కొట్టాడు. బీరువా తాళాలు పగులగొట్టి విలువైన వస్తువుల కోసం వెతికాడు. గతంలో పలుమార్లు దొంగతనాల నేపథ్యంలో ఆలయంలో విలువైన వస్తువులు ఏమీ ఉంచలేదు. దీంతో దొంగకు ఏమీ దొరకక వెనుదిరిగాడు. సీసీ కెమెరాలను గమనించిన దొంగ కరెంట్ బోర్డును ధ్వంసం చేశాడు. గడిచిన ఆరేళ్లలో 8 సార్లు దొంగతనాలు జరిగాయని ఆలయ అర్చకులు తెలిపారు.

# పదేళ్లల్లో ఏం జరిగిందో కవిత తెలుసుకోవాలి



నల్గోండ పెన్ పవర్:తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలపై.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. గత పది ఏళ్ళు అధికారంలో ఉన్న పార్టీలో ఉండి.. ఉస్మానియా ఆసుపత్రినీ గాలికి వదిలేశారని.. నల్లగొండ జిల్లాలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీని పట్టించుకోలేదని.. జిల్లా ఆస్పత్రి అభివృద్ధిపై శ్రద్ధ పెట్టలేదని.. అప్పటి పాలకులను ఎందుకు ప్రశ్నించలేదని మంత్రి కోమటిరెడ్డి కవితను ప్రశ్నించారు. గత పదివేల కాలంలో పాలకులుగా ఉన్నవారు.. నల్లగొండ జిల్లాకు ఏం చేయలేదని.. అలాంటి వారిని ప్రశ్నించాలని ఆమెకు హితవు పలికారు. ఈరోజు నల్లగొండలో కవిత పర్యటనకు సంబంధించిన సమాచారం తనకు తెలియదని.. ప్రముఖుల విగ్రహాల దగ్గర పెట్టిన కటౌట్లను మున్సిపల్ అధికారులు తొలగించారని ఆయన చెప్పుకొచ్చారు. తమపై విమర్శలు చేసే ముందు.. గత పది ఏళ్లల్లో ఏం జరిగిందో వెరిపై చేసుకోవాలని ఆయన సూచించారు..

# కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల ఘర్షణ






ఆదిలాబాద్ పెన్ పవర్::అదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం లో ఉద్రిక్తత నెలకొంది. ప్రోటోకాల్ విషయంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వివాదం చెలరేగింది. బిఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పరస్పరం దాడులు చేసుకున్నారు. పదవులు లేని వారిని స్టేజిపై కూచొబెట్టి, పదవులు వున్న వారిని మరిచారని కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేసారు. పదవులు లేని వారి పేర్లు ప్రసంగం లో తీసుకోవటం తో ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ప్రసంగాన్ని కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. మాట మాట పెరిగి పరస్పరం దాడులు చేసుకునే వరకు వివాదం పెరిగింది. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కాంగ్రెస్ నాయకులకు ఎంత నచ్చచెప్పినా వినకపోవడంతో ఉద్రిక్తతకు దారితీసింది , దీంతో పోలీసులను భారీగా మోహరించారు. వెంటనే సంఘటన స్థలానికిడిఎస్పీ చేరుకున్నారు. పోలీసులు ఇరువర్గాలను ఘటన స్థలం నుండి పంపించి వేసారు.

# మేడారంలో మంత్రుల పర్యటన..




హైదరాబాద్ పెన్ పవర్:
ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క సారలమ్మ లను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,సీతక్క, కొండ సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ లు సమ్మక్క సారలమ్మ లను దర్శించుకున్నారు. అనంతరం మంత్రులు మేడారం ప్రాంగణంలో జరుగుతున్న గద్దెల విస్తరణ పనులు, జాతర అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. వచ్చే ఏడాది జనవరి లో జరగనున్న మహా జాతర సందర్భంగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రులు తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మేడారం ప్రాంగణాన్ని ఆదివాసీ ఆచారాలకు, సాంప్రదాయాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతరకు 15 రోజుల ముందే పనులు పూర్తి చేస్తామని 200 ఏళ్లు చెక్కు చెదరకుండా, 10 కోట్ల మంది భక్తులు వచ్చిన ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణాలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ దేవతల పై మాకు ఉన్న భక్తి , బంధం, అనుబంధం , చిత్త శుద్ధితో అభివృద్ధి చేస్తున్నాం,. ఆదివాసుల అస్తిత్వం, ఆత్మ గౌరవం ఏ మాత్రం దెబ్బ తినకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని, 10 రోజుల్లో మేడారం కు ఒక రూపం వస్తుందని, సమ్మక్క సారలమ్మ చాలా పవర్ ఫుల్ అని దేవతల మీద రాజకీయాలు తప్పుడు ప్రచారాలు చేయవద్దని, తల్లుల మీద రాజకీయాలు చేస్తేమంచిది కాదని, పడి తరాలు మెచ్చుకునేలా నిర్మాణాలు చేపడుతున్నామని మంత్రి సీతక్క అన్నారు..

## విశాఖ బీచ్ రోడ్డులో యూనిటీ రన్

హైదరాబాద్ పెన్ పవర్:ఉక్కు మనిషి భారత మాజీ ఉప ప్రధాని, మాజీ కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా యూనిటీరన్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా విశాఖ బీచ్ రోడ్డులో మైభారత్ ఆధ్వర్యంలో జరిగిన యూనిటీ రన్ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ , నార్త్ శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు, టిడిపి రాష్ట్రఅధ్యక్షులు మరియు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జెండా ఊపి ఐక్యతా రన్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖండ భారతావని కోసం ఎంతోకృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ నేటి యువతకు స్ఫూర్తి అని అన్నారు. బీచ్ రోడ్ కాళీమాత ఆలయం నుండి వైయంసిఏ వరకు భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేస్తూ యూనిటీ రన్ చేసారు. ఈ కార్యక్రమంలోకోటమి నాయకులు ఎంపీ మరియు ఎమ్మెల్యేల నాయకులు పాల్గొన్నారు

## తాడేపల్లి లో హిందువుల అందోళన

హైదరాబాద్ పెన్ పవర్:
విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో హిందువులు ఆందోళన చెందే ఘటన జరిగింది. గ్రామంలో ప్రధాని రహదారి పక్కన 40 సంవత్సరాలుగా ఉంటున్న కాళీమాత ఆలయానికి సంబంధించిన సత్రంను ఆర్ అండ్ బి అధికారులు కూల్చి వేశారు. ఆలయంలో అమ్మవారి మూల విరాట్ ను సైతం పలుగులతో తవ్వి తొలగించేందుకు ప్రయత్నించగా భక్తులు అడ్డుకున్నారు. స్థానికంగా ఓ పొలానికి వెళ్లేందుకు అడ్డుగా ఉందనే సాకుతో 40 ఏళ్ల నాటి ఆలయాన్ని కూల్చివేసే చర్యలు ఆర్ అండ్ బి అధికారులు చేపట్టారంటూ భక్తుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం హిందుత్వ వాదాన్ని బలంగా వినిపిస్తుంటే అధికారులు ఇటువంటి చర్యలకు దిగటం ఏంటని ప్రశ్నిస్తున్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్యలు ఆపాలంటున్న భక్తులు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం, హిందూ ధార్మిక సంస్థలు స్పందించి ఆలయ , సత్రం నిర్మాణాలను తిరిగి నిర్మించేలా చూడాలని లేనిపక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్నారు.

## అంగరంగ వైభముగా స్వామి వారి నిత్య కల్యాణం

హైదరాబాద్ పెన్ పవర్:ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్ఠింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

## తిరుపతిలో వైకాపా ర్యాలీ

**హైదరాబాద్ పెన్ పవర్:**మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పై రాష్ట్ర వ్యాప్తంగా వైకాపా నేతలు భారీ నిరసన ర్యాలీలు నిర్వహించారు. తిరుపతి , కొర్లగుంటులో కుడా భారీ ర్యాలీ చేపట్టారు. .తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త అభినయ్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైకాపా శ్రేణులు వేలాదిగా తరలివచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పై వైకాపా ప్రజలతో కలిసి నిరసన చేపట్టింది. ర్యాలీలో భూమన అభినయ్ రెడ్డి, మేయర్ శిరీష యాదవ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలల ప్రైవేటీకరణను ఆపాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**చంద్రబాబు వంచనపై శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో కదం తొక్కిన వైఎస్ఆర్ సీపీ శ్రేణులు...స్వాతంత్ర్య భారతదేశంలో కనీవినీ ఎరుగని విధంగా 17 మెడికల్ కాలేజీలను సాధించి జాతికి అంకితం చేసిన నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయానికి తూట్లు పొడుస్తూ వాటిని తమ బినామీలకు కట్టబెట్టె ప్రయత్నాన్ని ఖండిస్తూ శ్రీశైలం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి నేతృత్వంలో విద్యార్థులు,యువత, వైయస్ఆర్ సీపీ నాయకులు, మహిళలు రోడ్డెక్కారు. ఆత్మకూరు టౌన్ లోని నంద్యాల టర్నింగ్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి,ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు.

శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ..గతంలో ప్రభుత్వ రంగ సంస్థలను తన కోటరీకి ధారాదత్తం చేసిన చంద్రబాబు ప్రస్తుతం ఆంధ్ర యువతకు ఆశాదీపమైన మెడికల్ కాలేజీలను తన స్వప్రయోజనాలకోసం తన మిత్రులకు,బినామీలకు ధారాదత్తం చేయాలని చూస్తున్నాడని నిప్పులు చెరిగారు. మెడికల్ కాలేజీలను పీపీపీ విధానం నిర్ణయానికి స్వస్తి పలికి ప్రభుత్వం నిర్మించకుంటే వైఎస్ఆర్ సీపీ నేతృత్వంలో తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని శిల్పా చక్రపాణి రెడ్డి గారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో

శ్రీశైలం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి గారు, నంద్యాల పార్లమెంట్ పరిశీలకులు ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి , నియోజకవర్గ పరిశీలకులు పిపి. మధుసూదన్ రెడ్డి గారు శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి మరియు వైయస్ఆర్ సీపీ నాయకులు ,విద్యార్థులు, యువకులు,మహిళలు ,వైయస్ఆర్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

## రాజేంద్రనగర్ లో దొంగల హల్ చల్

**హైదరాబాద్ పెన్ పవర్:**

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరొకమారు దొంగలు రెచ్చిపోయారు.బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ గ్రామం ఓం నగర్ కాలనీ సాఫ్ట్వేర్ ఇంజనీర్ కిరణ్ ఇంట్లోకి చొరపడిన దొంగలు 30 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. దొంగతనం జరిగిన విషయాన్నిగమనించిన కిరణ్ కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**హైదరాబాద్ పెన్ పవర్:**

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం నాడు జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు నిత్యం అవగాహనాకార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలనుఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలుకేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలు,సైబర్ నేరాలపై నిత్యం పోలీస్ స్టేషన్పరిధిలోని గ్రామాలలో లోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామనితెలిపారు.ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ శ్రీ లక్ష్మీ,ఎస్సై రవి, సిబ్బంది పాల్గొన్నారు.

# విటమిన్ డి లోపం ఉన్నట్లే.. ఏయే ఆహారాలను తీసుకోవాలంటే..?

**హైదరాబాద్ పెన్ పవర్:**



మన శరీరంలో ఎముకలు ఆరోగ్యంగా ఉండాలన్నా, రోగ నిరోధక శక్తి పెరగాలన్నా అందుకు విటమిన్ డి ఎంతగానో దోహదం చేస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే కేవలం ఇవే కాదు, ఇంకా అనేక రకాల

జీవక్రియలకు విటమిన్ డి అవసరం అవుతుంది. అయితే ప్రస్తుతం చాలా మంది విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. దీర్ఘకాలిక రోగాలకు మందులను వాడడం, ఎల్లప్పుడూ సూర్య రశ్మి తగలకుండా ఇంట్లోనే ఉండడం లేదా కార్లు, ఆఫీసుల్లో గడపడం, శారీరక శ్రమ చేయకపోవడం, ఒత్తిడి, ఆందోళన వంటి అనేక కారణాల వల్ల చాలా మందికి విటమిన్ డి లోపం వస్తోంది. విటమిన్

డి లోపం ఉన్నవారికి పలు వ్యాధులు కూడా వస్తున్నాయి. అయితే విటమిన్ డి లోపం ఉంటే మన శరీరం మనకు పలు లక్షణాలను, సంకేతాలను తెలియజేస్తుంది. వాటిని గమనించడం ద్వారా విటమిన్ డి లోపం ఉందన్న విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. విటమిన్ డి లోపం ఉంటే కనిపించే లక్షణాలు..

విటమిన్ డి లోపం వల్ల రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. తరచూ ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి. ముఖ్యంగా తరచూ దగ్గు, జలుబు బారిన పడుతుంటారు. ఒక పట్టాన ఇవి తగ్గవు. ఎల్లప్పుడూ నీరసంగా, అలసటగా అనిపిస్తుంది. చిన్న పని చేసినా విపరీతంగా అలసిపోయినట్లు ఫీలవుతారు. ఎముకలు బలహీనంగా మారుతాయి. చేతులు, కాళ్లు, వెన్ను భాగాల్లో ఉండే ఎముకలు నొప్పిగా ఉంటాయి. ఒత్తిడి, ఆందోళన ఉంటుంది. కొందరు డిప్రెషన్ బారిన పడతారు. గాయాలు, పుండ్లు త్వరగా మానవు. కొందరికి ఎముకలు మరీ బలహీనంగా మారి చిన్న దెబ్బలకే విరిగిపోయే అవకాశాలు ఉంటాయి. అలాగే జుట్టు రాలుతుంది. శిరోజాలు అంద

విహీనంగా మారుతాయి. కండరాల నొప్పులు ఉంటాయి. ఎవరిలో అయినా ఈ లక్షణాలు అన్నీ కనిపిస్తుంటే వారిలో విటమిన్ డి లోపం ఉన్నట్లు అర్థం చేసుకోవాలి. వెంటనే డాక్టర్ను కలిసి పరీక్షలు చేయించుకుని

అవసరం అయితే చికిత్స తీసుకోవాలి. విటమిన్ డి లోపం ఉన్నవారికి వైద్యులు ట్యాబ్లెట్లను ఇస్తారు. వాటిని క్రమం తప్పకుండా తీసుకోవాలి. అలాగే ఆహారం విషయంలోనూ మార్పులు చేసుకుంటే ఈ లోపం నుంచి

**సులభంగా బయట పడవచ్చు.**

**ఏ వయస్సు ఎంత అవసరం..?**

విటమిన్ డి రోజువారి అవసరం సాధారణంగా వయస్సును బట్టి మారుతుంది. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఏడాది వయస్సు ఉన్నవారికి రోజుకు 400 ఐయూ వరకు విటమిన్ డి అవసరం అవుతుంది. 1 ఏడాది

నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్నవారికి రోజుకు 600 ఐయూ మోతాదులో విటమిన్ డి కావాలి. 19 ఏళ్లకు పైబడిన వారికి, 70 ఏళ్ల లోపు ఉన్నవారికి రోజుకు 600 ఐయూ, 70 ఏళ్లకు పైబడిన వారికి రోజుకు 800 ఐయూ మోతాదులో విటమిన్ డి కావల్సి ఉంటుంది. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు రోజుకు 800 ఐయూ మోతాదులో విటమిన్ డి లభించేలా చూసుకోవాలి. దీని వల్ల విటమిన్ డి లోపం రాకుండాచూసుకోవచ్చు. అయితే విటమిన్ డి లోపం ఉన్నవారికి రోజుకు కావల్సిన మోతాదు కన్నా ఎక్కువగానే తీసుకోవాలని వైద్యులు ట్యాబ్లెట్లను ఇస్తారు. వాటిని క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది.

**ఏమేం తీసుకోవాలి..?**

విటమిన్ డి మనకు సాధారణంగా సూర్య రశ్మి ద్వారా లభిస్తుంది. రోజు ఉదయం 8 గంటల లోపు సూర్య రశ్మిలో కనీసం 20 నిమిషాల పాటు గడిపితే దాని వల్ల చర్మం కింద భాగంలో విటమిన్ డి దానంతట అదే తయారవుతుంది. ఇది శరీర అవసరాలకు సరిపోతుంది. విటమిన్ డి లోపం ఉన్న వారు పలు ఆహారాలను కూడా తీసుకోవచ్చు. ఇది మనకు ఎక్కువగా పాలు, పెరుగు, చీజ్, కోడిగుడ్లు, చేపలు, రొయ్యలు, పుట్ట గొడుగులు, పచ్చి బఠానీలు, పాలకూర వంటి వాటిల్లో లభిస్తుంది. ఈ ఆహారాలను రోజూ తీసుకుంటే విటమిన్ డి పుష్కలంగా లభిస్తుంది. దీంతో విటమిన్ డి లోపం నుంచి సులభంగా బయట పడవచ్చు.

# నెలలో 13 కోట్లు తగ్గిన ఎకరం!

- రాయదుర్గ్‌లో ఎకరం భూమికి 164 కోట్లు..ఇదే ప్రాంతంలో గత నెలలో 177 కోట్లు
- టీజీఐఐసీ నిర్వహిస్తున్న భూముల వేలంపై పలు అనుమానాలు
- నెల రోజుల్లోనే ఇంత వ్యత్యాసం రావడం రియల్ఎస్టేట్ వర్గాలను ఆందోళన
- నగరంలో భూముల విలువ పడిపోవడంలేదని చెప్తున్న టీజీఐఐసీ అధికారులు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి రియల్ఎస్టేట్ రంగం నేలచూపులు చూస్తున్న నేపథ్యంలో టీజీఐఐసీ నిర్వహిస్తున్న భూముల వేలంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క నెలలోనే ఎకరాపై దాదాపు రూ.13 కోట్ల వరకూ ధర తగ్గడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. టీజీఐఐసీ తాజాగా నిర్వహించిన రాయదుర్గ్ పాన్‌మక్తా భూముల వేలంలో ఎకరాకి రూ.164 కోట్ల ధర పలికింది. అదే ప్రాంతంలో గత నెలలో వేలం నిర్వహించగా ఎకరా భూమి రూ.177 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం. ఒకే ప్రాంతంలో నెల రోజుల్లోనే ఇంత వ్యత్యాసం రావడం రియల్ఎస్టేట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది.

**గజం 3.4 లక్షలు**

టీజీఐఐసీ సోమవారం రాయదుర్గ్ పాన్‌మక్తాలో రెండు ప్లాట్లకు వేలం నిర్వహించగా, గజానికి రూ.3,40,000 చొప్పున ధర పలికింది. ఈ రెండు ప్లాట్లు కలుపుకొని 4,700 గజాలు (ఎకరాకు సుమారు 140 గజాలు తక్కువ) కాగా, దీనిపై టీజీఐఐసీకి రూ.160 కోట్ల ఆదాయం సమకూరింది. దీన్నిబట్టి ఎకరా ధర రూ.164 కోట్లుగా చెప్పవచ్చు. నాలెడ్జ్‌సిటీగా పేరుగాంచిన పాన్‌మక్తా ప్రాంతంలో గత అక్టోబర్‌లో టీజీఐఐసీ వేలం నిర్వహించగా, ఎకరా భూమికి రూ.177 కోట్ల ధర పలికింది. దీనిపై టీజీఐఐసీ అధికారులు స్పందిస్తూ.. తాజా వేలంలో ఎకరా భూమి రెండు ప్లాట్లుగా విడివిడిగా ఉండటం వల్లే బిల్డర్ల మధ్య పోటీ తగ్గి ధర తగ్గిందని, అంతేతప్ప నగరంలో భూముల విలువ పడిపోవడంలేదని చెప్తున్నారు. 2017లో ఇదే ప్రాంతంలో వేలం నిర్వహించగా గజం ధర రూ.88,000 మాత్రమే పలికిందని, దాంతో పోల్చుకుంటే ఇప్పుడు పలుకుతున్న ధర ఎంతో అధికమని సమర్థించుకుంటున్నారు.

**బీఆర్ఎస్ హయాంలో ఫుల్ జోష్**

హైదరాబాద్ వెస్ట్‌జోన్ ప్రాంతంలో భూముల ధరలు పెరగడమే తప్ప తగ్గడం అనేది ఉండదు. గత అనుభవాల ద్వారా ఇది స్పష్టమవుతున్నది. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భూముల ధరలు పెరిగాయి. పదేండ్లపాటు దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో భూముల ధరలు పెరగడం విశేషం. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి రియల్ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోయింది. ముఖ్యంగా వ్యవసాయ భూములు కొనే నాథుడే కరువయ్యాడు. హైదరాబాద్‌లో సైతం వేల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు అమ్ముడుపోవడంలేదని వివిధ సర్వేలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భూముల విక్రయం ద్వారా రియల్ఎస్టేట్ రంగం స్థిరంగా ఉన్నదనే సందేశం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని పలువురు చెప్తున్నారు. మొత్తం మీద వేలంలో భూముల ధర హెచ్చుతగ్గులపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకోవాలి



**హైదరాబాద్ పెన్ పవర్:**రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశించారు.బుధవారం జిల్లాలోని మల్యాల, కొడిమ్యాల మండల పరిధిలోని రైతులు, రైస్ మిల్లర్ లతో జేఎన్టీయూ కళాశాలలో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సంధర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ

రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకోవాలని ఆదేశించారు.రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని 17 % లోపు వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని రైతులకు సూచించారు.రైతులు వరి కోతల తర్వాత ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, పొలం నుండి నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావద్దని రైతులను కోరారు.ఆనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తేమశాతం వచ్చేవరకు ధాన్యం ఆరబెట్టాలని తెలిపారు.రైతులు ఆరిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వస్తే వెంటనే కాంటా వేసి సంబంధిత మిల్లులకు నిర్వాహకులు ధాన్యాన్ని తరలిస్తారని అన్నారు.

రైతుల వివరాలు వెంటనే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అందించాలని తెలిపారు.

కొనుగోలు కు సంబందించిన సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ ను సంప్రదించాలని తెలిపారు. మిల్లర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం దిగుమతులు చేసుకోవాలని ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఈ సమావేశంలో ఆర్డీవో మధుసూదన్, డిఎస్వో జితేందర్ రెడ్డి, డిసివో మనోజ్ కుమార్, డిఎం జితేంద్ర ప్రసాద్, ఎమ్మార్వో లు, ఎంపిడివోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తమిళనాడులో రోడ్డు ప్రమాదం.. పోలీసులు వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్::** తమిళనాడు రాష్ట్రం శివగంగ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. తిరుప్పువనమ్‌లోని సక్కుడిలో ద్విచక్రవాహనాన్ని పోలీసులు వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో మహిళ తీవ్రంగా గాయపడడంతో మదురైలోని ప్రభుత్వా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అనంజియూర్ లోని బంధువుల ఇంట్లో వేడుకకు వెళ్లివస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతులు ఒకే కుటుంబానికి చెందిన ప్రసాద్, సత్య అనే దంపతులు, కూతరు అశ్విన్ గా గుర్తించారు. గాయపడిన మహిళ పేరు ఈశ్వర్ గా గుర్తించారు. మృతులు మేలురు ప్రాంతంలోని చిత్తపాటి గ్రామానికి చెందిన వారు అని పోలీసులు వెల్లడించారు.

# యువత సాహసాలు చేసినప్పుడే విజయం దక్కుతుంది

ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్ పెన్ పవర్:**యువత సాహసాలు చేసినప్పుడే విజయం దక్కుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఉన్నతస్థానానికి చేరుకోవాలనే లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా కష్టపడాలని యువతకు సలహా ఇచ్చారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. యువత సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే వారికే ఉజ్జల భవిష్యతు ఉంటుందని వివరించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కొత్త విధానం తీసుకొచ్చామని, అంకుర పరిశ్రమలు వంద కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలని, స్టార్టప్‌లకు సాయం చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఇవాళ ప్రపంచమంతా మనవైపు చూస్తోందని, ఇతర దేశాల్లో అవకాశాల కోసం చూడవద్దని కోరారు. ఇతర దేశాలు భారత్‌పై ఆధారపడే స్థితికి మనం ఎదగాలన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్ ప్రజలకు తెలియజేశారు. బుధవారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల బొందిమడుగుల గ్రామం నందు గ్రామ పరిశుభ్రతలో భాగంగా మండల అభివృద్ధి అధికారి విశ్వమోహన్ చెత్త సేకరణ ట్రై సైకిల్స్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధి దృష్టిలో పెట్టుకొని పంచాయతీ కార్మికులకు మీ వీధిలోకి వచ్చినప్పుడు చెత్తను అందులో వెయ్యాలని తెలియజేశారు. ప్రభుత్వం వారు అందజేసిన తడి చెత్త మరియు పొడి చెత్త బుట్టలను వినియోగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరవ సలహాదారుడు ప్రతాప్ యాదవ్, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగేంద్ర నాయక్,వార్డ్ మెంబర్స్ వీరేంద్ర,బెస్తా లక్ష్మీదేవి,తలారి రాముడు,స్వచ్ఛభారత్ కార్మికులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గాంధీజీ విగ్రహాల సేకరణకు ప్రచార రథం



హైదరాబాద్ పెన్ పవర్:ల సేకరణ కార్యక్రమం.ఈ సందర్భంగా ప్రచార రథాన్ని పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్లు కల్వ సుజాత ,, దీపక్ జాన్ ,,గాంధీ విజ్ఞాన కేంద్రాల కమిటీ రాష్ట్ర కన్వీనర్ , గాంధారి ప్రభాకర్,గాంధీ గాని ప్రతిష్ట వైస్ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి , ఆర్గనైజర్ అండ్ అడ్వైజర్ కె .రాజునాగేశ్వరావు , వైస్ ప్రెసిడెంట్ నీరుడు దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భూసార పరీక్ష పత్రాలు పంపిణీ

హైదరాబాద్ పెన్ పవర్:రైతులు భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకాన్ని వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ అన్నారు. మంగళవారం సి.బెళగల్ మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం నందు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వివిధ పంటల్లో చేపట్టాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. భూమిలో వివిధ మూలకాల ఆవశ్యకత, నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువుల యొక్క ప్రాధాన్యతను తెలిపారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష ఫలితాల పత్రాలను పంపిణీ చేశారు. మండలంలో యూరియా కొరత లేదని, రైతు సేవా కేంద్రాలలో 80 టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు తెలిపారు. ప్రైవేట్ డీలర్స్ దగ్గర కూడా యూరియా మరియు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ఏఈఓలు, వీహెచ్ఏ అంజలి, ఎంపీఓలు సునంద, రైతులు ఉన్నారు.

### అభివృద్ధి నేపథ్యంలో ఇప్పటికే రాజన్న గుడిలో దర్శనాలు నిలిపివేత

హైదరాబాద్ పెన్ పవర్: దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజన్న ఆలయంలో దర్శనాల విషయంలో అధికారులు అనుసరిస్తున్న వైఖరి భక్తులకు ఇబ్బందికరంగా మారుతున్నది. ఆలయ అభివృద్ధి నేపథ్యంలో ఇప్పటికే రాజన్న గుడిలోదర్శనాలు నిలిపివేసిన అధికారులు.. తాజాగా ఆలయంలోకి ప్రవేశించకుండా ప్రధాన ద్వారం వద్ద ఇనుప రేకులు అమర్చారు. కేవలం స్వామి వారి చతుష్కాల పూజలకు అర్చకులను మాత్రమే అనుమతిస్తున్నారు.రాజన్న ఆలయ అభివృద్ధి నేపథ్యంలో భీమేశ్వరాలయంలోనే దర్శనాలతో పాటు కోడె మొక్కులు, ఇతర ఆర్జిత సేవలను నిర్వహిస్తున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా సుమారు నెల రోజుల నుంచిఆలయ పరిసరాలలో కూల్చివేతలు కొనసాగుతున్నాయి. దక్షిణ, ఉత్తర భాగాలలో ప్రాకారం, పడమర వైపు ఉన్న నైవేద్య శాల, ఆలయ ఈవో కార్యాలయం ఇప్పటికే తొలగించారు. ఆలయం చుట్టూ పలు ప్రాంతాల్లోభక్తులు లోనికి రాకుండా ఇప్పటికే ఇనుప రేకులు అమర్చారు. తాజాగా, బుధవారం తెల్లవారుజామున ఆలయ ప్రధాన ద్వారాన్ని కూడా ఇనుప రేకులతో మూసివేశారు. దేవాదాయ కమిషనర్, ఆలయ అధికారులుఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇలా ఆలయాన్ని మూసివేయడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి





జగిత్యాల/కొడిమ్యాల, పెన్ పవర్: కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని,ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలకు రాగానే త్వరగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు.

బుధవారం జిల్లా లోని కొడిమ్యాల మండలంలోని పూడూరు, నాచుపల్లి, డబ్బు, తిమ్మయ్యపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూకొనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలను పరీక్షించి నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని,కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ నిర్వాహకులను ఆదేశించారు.కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, రైతులకు 48 గంటల లోగా చెల్లింపులు జరిగేలా చూడాలని కలెక్టర్ నిర్వాహకులకు తెలిపారు.టార్పాలిన్, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు అవసరమైన మేరకు అందుబాటులో ఉండాలని నిర్వాహకులకు సూచించారు.

రైస్ మిల్లుల వద్ద ఎటువంటి జాప్యం లేకుండా దిగుమతి అయ్యేలా చూడాలని, హమాలీల సమస్య లేకుండా తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని అన్నారు.

గ్రేడ్ ' ఏ ' రకానికి 2389/- రూ. సాధారణ రకానికి 2369/- రూ. సన్నరకం ధాన్యానికి క్వింట కు 500/- రూ. బోనస్ ప్రభుత్వం అందిస్తుందని రైతులకు తెలిపారు.పొలం నుండి ధాన్యం నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురాకుండా ధాన్యాన్ని తేమ శాతం 17% వచ్చేవరకు ఆరబెట్టాలని రైతులకు సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన వెంటనే నిర్వాహకులకు రైతు వివరాలు అందించాలని తెలిపారు.ఈ పర్యటనలో ఆర్డీవో మధుసూదన్,డిఎస్వో జితేందర్ రెడ్డి, డిసివో మనోజ్ కుమార్, డిఏం జితేంద్ర ప్రసాద్, ఎమ్మార్వో లు ఎంపిడివో లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## తండ్రిని ఇంట్లోంచి గెంటేసిన కొడుకు

**-ఆశ్రయమిచ్చిన సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్.**



హైదరాబాద్ పెన్ పవర్:కన్న కొడుకు వృద్ధుడు అయిన తండ్రిని ఇంట్లోంచి గెంటి వేయగా ఆ తండ్రి మంగళవారం సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించారు. జిల్లా కేంద్రానికి చెందిన పూరంశెట్టి ఆంజనేయులు (70) అనే వృద్ధ తండ్రిని వెంటనే ఆ కొడుకు ఇంటికి హరి అశోక్ కుమార్ తీసుకొని పోగా ఆ కొడుకు ఇంటికి తాళం వేసి తన అత్త గారింటికి కరీంనగర్ వెళ్లి నట్లు చుట్టు ప్రక్కల వారు చెప్పారు.మరుసటి రోజు బుధవారం ఆ కొడుకు వచ్చిన విషయం తెలిసిన హరి అశోక్ కుమార్ తమ సీనియర్ సిటిజెన్స్ కమిటీ ప్రతినిధులను వెంటేసుకొని ఆ కొడుకు ఇంటికి వెళ్లగా తలుపులు తీయక పోవడం తో ఆ కొడుకు ఇంటిముందు ఆ తండ్రి తో ధర్నా చేశారు. దీంతో ఆ కొడుకు తలుపులు తీసి తన భార్య ప్రేరణ తో ఇంటి నుంచి తండ్రి ని వెళ్ళ గొట్టినట్లు చెప్పి క్షమించమన్నారు. ఆ కోడలుకు, కొడుకు కు హరి అశోక్ కుమార్ కౌన్సిలింగ్ చేయడం తో వారు చుట్టు ప్రక్కల వారిముందు అసోసియేషన్ కు ఒప్పంద పత్రం రాసిచ్చి తండ్రిని ఇంట్లోకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో

సీనియర్ సిటిజెన్స్ ప్రతినిధులు గౌరి శెట్టి విశ్వ నాథం, పి. సీ. హన్మంత్ రెడ్డి, బొల్లం విజయ్, పూసల అశోక్ రావు, ఎం. డి. యాకోబ్,, వెల్మల ప్రకాష్ రావు, బొబ్బటి కరుణ, రాధ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు

**హైదరాబాద్ పెన్ పవర్:**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి, పోలింగ్ కేంద్రం వద్ద హల్‌చల్ చేశారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.మంగళవారం జరిగిన పోలింగ్ సమయంలో యూసఫ్‌గూడలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఆయన గందరగోళం సృష్టించారని, ఈ ఘటనపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని అధికారులు తెలిపారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం నిన్న పోలింగ్ జరుగుతుండగా కౌశిక్‌రెడ్డి తన అనుచరులతో కలిసి యూసఫ్‌గూడలోని మహ్మద్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు.ఎన్నికల నిబంధనల ప్రకారం లోనికి వెళ్లడానికి వీల్లేదని పోలీసులు అడ్డుకున్నప్పటికీ, ఆయన వినిపించుకోకుండా సిబ్బందిని నెట్టుకుంటూ లోపలికి వెళ్లారని వారు పేర్కొన్నారు.కౌశిక్‌రెడ్డి తీరు పోలింగ్ కేంద్రం వద్దఉద్రిక్తతలను రెచ్చగొట్టే విధంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో, ఆయనపై అక్రమంగా చొరబడటం (ట్రెస్పాస్), పబ్లిక్ న్యూసెన్స్ కింద కేసులు నమోదు చేసినట్లు మధురానగర్ పోలీసులు వివరించారు. నిన్నఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినప్పటికీ, కొన్నిచోట్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.

# నిర్మలా సీతారామన్ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ అరెస్ట్ వారెంట్.

## రూ.99 లక్షలు కొట్టేసిన కేటుగాడు

**హైదరాబాద్ పెన్ పవర్:**సైబర్ నేరస్థులు రోజురోజుకూ తెలివిమీరిపోతున్నారు. సరికొత్త ఎత్తులతో ఉన్నత విద్యావంతులనూ మోసం చేస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో మరో కొత్త వ్యూహంతో మోసాలకుపాల్పడుతున్నారు. తాజాగా పుణేకు చెందిన ఓ వృద్ధురాలిని డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి రూ.99 లక్షలు కాజేశారు. ఇందుకోసం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఓ అరెస్ట్ వారెంట్ ను సృష్టించారు. దీంతో ఉన్నతవిద్యావంతురాలు, ఎల్ఐసీ మాజీ ఉన్నతాధికారి అయిన ఆ వృద్ధురాలు నమ్మి మోసపోయారు. పుణే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పూణేకు చెందిన 62 ఏళ్ల మహిళ ఎల్ఐసీలోఉన్నతోద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. ఇటీవల ఆమెకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఆమె ఆధార్ కార్డ్ తో లింక్ అయిన ఓ ఫోన్ నెంబర్ తో దుండగులు ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని అవతలి వ్యక్తి బెదిరింపులకుగురిచేశాడు. ఈ విషయంపై సీనియర్ ఆఫీసర్ వీడియో కాల్ లో మాట్లాడతారంటూ ఫోన్ పెట్టేశాడు. కాసేపటి తర్వాత సీనియర్ పోలీస్ ఆఫీసర్ జార్జ్ మాథ్యూ పేరుతో మరో దుండగుడు వాట్సాప్ వీడియో కాల్ చేశాడు.

ఆమె ఆధార్ కార్డ్ తో లింక్ అయిన ఫోన్ నెంబర్ తో ఆర్థిక మోసాలు జరిగాయని, ఈ కారణంగా మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేశామని చెప్పాడు.ఇందుకు సంబంధించి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సంతకంతో జారీఅయిన ఓ నకిలీ అరెస్ట్ వారెంట్ ను వాట్సాప్ చేశాడు. మనీలాండరింగ్ కేసు కావడంతో దర్యాప్తు కోసం బ్యాంకులో ఉన్న నగదు మొత్తం తాము సూచించిన ఖాతాకు బదిలీ చేయాలని, ఆర్బీఐ తనిఖీ తర్వాత ఆ మొత్తంతిరిగి ఆమె ఖాతాలో జమ అవుతుందని నమ్మబలికాడు. నిధులు బదిలీ చేయకుంటే జైలుకు వెళ్లాల్సి వస్తుందని బెదిరించడంతో భయాందోళనకు గురైన బాధితురాలు దుండగుడు చెప్పిన బ్యాంకు ఖాతాలకు రూ.99 లక్షలు బదిలీ చేసింది. ఆ తర్వాత దుండగుడికి ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించింది. పుణే సైబర్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# చలిగాలులు చంపేస్తున్నాయ్.. ఇంకా ఎన్ని రోజులంటే?




**హైదరాబాద్ పెన్ పవర్:**జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల పోలింగ్ పూర్తయింది. ఈ నెల 14వ తేదీన కౌంటింగ్ జరగనుంది. అయితే ఈ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ లో సర్వేలన్నీ కాంగ్రెస్ కే అనుకూలంగా వచ్చాయి. అతి తక్కువ శాతం పోలింగ్ నమోదయింది. పోల్ మేనేజ్ మెంట్ లో బీఆర్ఎస్ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. దీంతో కాంగ్రెస్ కు ఈ ఎన్నికలలో ఎడ్జ్ ఉన్నట్లు కనిపిస్తుందని దాదాపు అన్ని సర్వేలు తేల్చాయి. బీజేపీకి డిపాజిట్ రావడం కూడా కష్టమని సర్వేలు తేల్చాయి. రాత్రికి రాత్రి కాంగ్రెస్ ఫలితాలను తనకు అనుకూలంగా మార్చుకున్నట్లు సర్వే సంస్థలు వెల్లడించాయి. మరో మూడేళ్ల కాలం కాంగ్రెస్ కు అధికారం ఉండటంతో ఓటర్లు ఎక్కువ మంది కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపినట్లు ఈ సర్వేల్లో స్పష్టమయింది.


**పోల్ మేనేజ్ మెంట్ లో...**

మరొకవైపు బీఆర్ఎస్ ప్రచారం ఉధృతంగా చేసినప్పటికీ పోలింగ్ కేంద్రాల వద్ద మాత్రం చేతులెత్తేసినట్లు కనిపిస్తుంది. ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ నేతల ఫ్రస్టేషన్ చూస్తుంటే వారికి పరిస్థితి అర్థమయిందని అంటున్నారు. అందుకే దొంగ ఓట్లు అంటూ విమర్శలు చేస్తున్నారంటున్నారు. మరొకవైపు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు కూడా బీఆర్ఎస్ కు లేకపోవడం ఆ పార్టీ దుస్థితికి అద్దం పడుతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. బీఆర్ఎస్ కు ఓటేస్తే ఏమి చేస్తామో చెప్పకుండా ప్రచారం మొత్తం ప్రభుత్వంపై విమర్శలు చేయడం కూడా ఆ పార్టీకి నష్టం చేకూర్చిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే దాదాపు అన్ని సర్వే సంస్థలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో ఎవరిది విజయమన్నది ముందుగానే తెలిసిపోయిందంటున్నారు. నాలుగు లక్షల ఓటర్లున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కేవలం 48 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి. అంటే రెండున్నర లక్షల ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఎవరు గెలిచినా మెజారిటీ ఆరు నుంచి ఏడు వేలకు మించి రాదన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి.

**సర్వేలు ఇలా...**

అపర చాణక్య సర్వే ప్రకారం కాంగ్రెస్ 47శాతం, బీఆర్ఎస్ 41శాతం, బీజేపీ 6 శాతం ఓట్లు వస్తాయని చెప్పింది. కౌటిల్య స్ట్రాటజీస్ కాంగ్రెస్ కు 48 శాతం, బీఆర్ఎస్ 42 శాతం, బీజేపీ 7 శాతం ఓట్లు వస్తాయని చెప్పింది.చాణక్య స్ట్రాటజీస్ కాంగ్రెస్ కు 46 శాతం, బీఆర్ఎస్ కు 41 శాతం, బీజేపీ ఆరు శాతం ఓట్లకే పరిమితమవుతాయని తెలిపింది. పీపుల్స్ పల్స్ కాంగ్రెస్ కు 48 శాతం, బీఆర్ఎస్ కు 41 శాతం, బీజేపీకి 6శాతం ఓట్లు వస్తాయని తెలిపింది. స్మార్ట్ పోల్ కాంగ్రెస్ కు 51 శాతం, బీఆర్ఎస్ కు 39 శాతం, బీజేపీకి ఐదు శాతం ఓట్లు, నాగన్న సర్వే కాంగ్రెస్ కు 47 శాతం, బీఆర్ఎస్ కు 41శాతం, బీజేపీకి 8 శాతం ఓట్లు వస్తాయని వెల్లడించింది. ఒక్క కేకే సర్వే మాత్రం కాంగ్రెస్ కు 46 శాతం, బీఆర్ఎస్ కు 49 శాతం, బీజేపీకి రెండు శాతం ఓట్లు వస్తాయని తెలిపింది. బీకే సర్వే కూడా బీఆర్ఎస్ కు యాభై, కాంగ్రెస్ కు 44, బీజేపీకి 4 శాతం ఓట్లు వస్తాయని చెప్పింది. అయితే ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఎగ్జాట్ పోల్స్ కావు. అలాగని కొట్టిపారేయలేం. మొత్తం మీద మూడు పార్టీలకు ఈ ఉప ఎన్నిక టెన్షన్ పెట్టిందనే చెప్పాలి.

# ఉగ్రవాదానికి.. హైదరాబాద్ కు లింకు లేకుండా ఉండదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉగ్రమూకలు మన మధ్యనే ఉంటున్నాయి. ఎవరికీ అనుమానం రాకుండా మంచిగా నటిస్తూ దేశంలో విధ్వంసానికి పాల్పడుతున్నారు. తాజాగా హైదరాబాద్ లో అరెస్టయిన హైదరాబాద్ కు చెందిన అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ వైద్య వృత్తిలో ఉంటూ దేశంలో పలు చోట్ల విధ్వంసానికి కుట్ర పన్నినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు అనుమానిస్తున్నారు. రాజేంద్ర నగర్ లో అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ ను అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారణ చేసే సమయంలో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. వీరిని పట్టుకోకుంటే మరిన్ని ప్రాణాలు పోయేవి. మరిన్ని చోట్ల పేలుళ్లు జరిగేవి. బహుశా హైదరాబాద్ కూడా ఒకటి అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

**ఆదేశాల కోసం...**

ఉత్తర్ ప్రదేశ్ కు చెందిన ఆజాద్ సులేమాన్ షేక్, మహ్మద్ సుహేల్ సలీంఖాన్ లతో కలసి దేశంలో పలు చోట్ల రద్దీగా ఉన్న ప్రాంతాల్లో పేలుళ్లు జరపాలని కుట్ర పన్నినట్లు ప్లాన్ వేశారు. అయితే వారు ఈప్లాన్ ను ఎక్కడ అమలు చేయాలి? ఏ ఏ నగరాల్లో పేలుళ్లు జరపాలి? అన్న ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఈ విషయాన్ని పసిగట్టిన గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ ను అదుపులోకి తీసుకోవడంతో పెద్దముప్పు తప్పినట్లయింది. పేలుళ్లకు అంతా సిద్ధం చేసుకున్నారని, కానీ ఐసిస్ సభ్యుడు అబూ ఖదీజా ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయింది. అయితే దేశంలో ఎక్కడ ఉగ్రదాడులకు ప్లాన్ జరిగినా అందులో హైదరాబాద్ మూలాలు ఉంటున్నాయి. అందుకే హైదరాబాద్ పై జాతీయ దర్యాప్తు సంస్థతో పాటు అన్ని విభాగాల పోలీసు శాఖలు ఒక కన్నేసి ఉంచుతున్నారు.

**వైద్య వృత్తి చదివి...**

ఖమ్మంలో అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ ప్రాథమిక విద్య చదువుకున్నాడు. ఆరుగురు పిల్లలున్న ఈ కుటుంబంలో అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ పెద్దవాడు. పదోతరగతి వరకూ ఖమ్మంలోనూ, ఇంటర్ వరంగల్ లోనూ చదివాడు. తర్వాత వైద్య విద్య కోసం చైనాకు వెళ్లాడు. 2007లో చైనా వెళ్లిన అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ తర్వాత తిరిగి రాష్ట్రానికి వచ్చాడు. వైద్య వృత్తి చదివి రావడంతో తమ నివాసాన్ని ఖమ్మం నుంచి హైదరాబాద్ లోని రాజేంద్ర నగర్ కు మార్చాడు. వైద్యుడిగా కొన్ని రోజులు చేసిన తర్వాత వ్యాపారంలోకి దిగాడు. అత్తాపూర్ లో ఒక హోటల్ లో పార్ట్ నర్ గా చేరాడు. వైద్యంలో ఆన్ లైన్ కన్సెల్టెన్సీని ప్రారంభించాడు. తర్వాత ఉగ్రవాద భావాజాలానికి ఆకర్షితుడయ్యాడు. అనంతరం తన గదిలో రైసిన్ ను తయారు చేయడం ప్రారంభించాడు. దీంతో ప్రజలను చంపేయవచ్చని ప్లాన్ చేశాడు. ప్రస్తుతం అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ గుజరాత్ ఏటీఎస్ పోలీసుల అదుపులో ఉన్నాడు. మొత్తం మీద హైదరాబాద్ కు, ఉగ్రదాడులకు లింకు ఉండటంతో నగర పోలీసులు కూడా అప్రమత్తమయ్యారు.